





# మెట్రోలకు మొండిచేయిపై ఆగ్రహం

- కేంద్రం తీరును నిరసిస్తూ భారీ ధర్నా
- కోవైలో కూటమి నేతల నిరసన



ధర్నాలో లౌకిక ప్రగతిశీల కూటమి నేతలు, కార్యకర్తలు



పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్, మదురై మెట్రో రైల్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించడంతో లౌకిక ప్రగతిశీల కూటమి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కోవైలోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం వద్ద కూటమి నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఆందోళన చేపట్టారు. రాజధాని నగరం చెన్నైలో మెట్రోరైలు ప్రాజెక్ట్ ఉండగా, కోయంబత్తూర్, మదురైలో కూడా మెట్రో రైళ్ల ప్రారంభించేందుకు సన్నాహాలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై నివేదికను కేంద్రప్రభుత్వానికి పంపించింది. ఈ ప్రాజెక్ట్‌లకు త్వరలో అనుమతి వస్తుందని భావిస్తున్న నేపథ్యంలో, కేంద్రప్రభుత్వం నుంచి తిరస్కరణ ఎదురైంది. దీంతో కేంద్రప్రభుత్వ తీరుపై రాష్ట్రంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. అధికార డీఎంకే, మిత్రపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రాల్లో బీజేపీయేతర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేయడమే కేంద్రప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. ఈ క్రమంలో, కోవై, మదురైలో మెట్రో ప్రాజెక్ట్‌ను నిరాకరించిన కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ లౌకిక ప్రగతిశీల కూటమి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కోవైలో చేపట్టిన ఈ ధర్నాతో డీఎంకే, కూటమి పార్టీలకు చెందిన నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రాన్ని అణగదొక్కుతున్న కేంద్రప్రభుత్వ వైఖరికి త్వరలోనే బుద్ధి చెబుతామని ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు ప్రకటించారు.

# ధాన్యం కొనం అనడం అన్యాయం

- కేంద్రంపై స్టాలిన్ ఆగ్రహం



భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోయంబత్తూరు పర్యటించిన తడి కూడా ఆరకముందే కేంద్రం రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లను నిరాకరించిందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. 'కోయంబత్తూరు మెట్రో రైల్ ప్రాజెక్టు ప్రతిపాదనలను తోసిపుచ్చిన మోదీ అదే కోయంబత్తూరుకు ఎలా వచ్చి వెళ్లారో? ఆయన వచ్చి వెళ్లిన తడి కూడా ఇంకా ఆరిపోలేదు. ఇంతలోనే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ళకు కేంద్రం నిరాకరించింది' అని సీఎం ఆరోపించారు. భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో ధాన్యం తడిసిందని, తడిసిన ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కేంద్రానికి తాము విజ్ఞప్తి చేశామన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ మొర ప్రధాని చెవికి వినిపించడం లేదా? రైతుల ఆర్తనాదాలు ఎందుకు వినిపించడం లేదు అని ప్రశ్నించారు. 'గతంలో పలుమార్లు ప్రభుత్వ అభ్యర్థలపై సానుకూలంగా స్పందించిన కేంద్రం.. ఇపుడు నిర్ద్వంగా తోసిపుచ్చడానికి కారణం ఏంటి? భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం అందజేయకుండా, ధాన్య సేకరణలో తేమ శాతాన్ని పెంచకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం వారికి మేలు చేసినట్టా' అని నిలదీశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ వినతులపై తక్షణం పునః పరిశీలన చేయాలని సీఎం స్టాలిన్ విజ్ఞప్తి చేశారు.

## శీతలీకరణ గిడ్డంగుల ప్రారంభం


కోయంబేడులో నిర్మించిన శీతలీకరణ గిడ్డంగులను ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం ప్రారంభించారు. అదేవిధంగా గృహ, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కోయంబేడు, ఆవడి, అన్ననూర్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ హైస్కూల్స్‌లో నిర్మించిన అదనపు తరగతి గదులను కూడా ప్రారంభించారు. కోయంబేడు హోల్ సేల్ మార్కెట్‌లో శీతల గోదాములు, పుళల్‌లో ఫుట్‌బాల్ మైదానం, చెట్‌పేట్‌లో మినీ ఫుట్‌బాల్ స్టేడియాలను రూ.20.89 కోట్లతో నిర్మించగా, వీటిని ఆయన ప్రారంభించారు. అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 190 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 12 అసిస్టెంట్ లైబ్రేరియన్, 11 పీఈటీ అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులకు ఎంపికైన వారికి ఆయన గురువారం నియామక పత్రాలను అందజేశారు.

## అన్ని స్థానాల్లో గెలిపించాలి: తిరువళ్లూర్ జిల్లా నేతలకు దిశానిర్దేశం

గత అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాలు మరోసారి పునరావృత్తం కావాలని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో డీఎంకే-కూటమి అభ్యర్థులను గెలిపించాలని తిరువళ్లూర్ జిల్లా నేతలకు పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ సూచించారు. తేనాంపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో గురువారం తిరువళ్లూర్ జిల్లా శాసనసభ నియోజకవర్గ నేతలతో భేటీ అయిన స్టాలిన్.. నియోజకవర్గంలో పార్టీ విజయావకాశాలు, నేతలు, కార్యకర్తల మధ్య నెలకొన్న విభేదాలు, ఇన్‌చార్జి మంత్రుల సహకారం, ద్రావిడ మోడల్ పాలనపై ప్రజాభిప్రాయం తదితరాలను స్టాలిన్ తెలుసుకున్నారు. అదే సమయంలో, ప్రతిపక్ష పార్టీలతో సంబంధాలున్న వారు, , పార్టీపై అసంతృప్తితో ఉన్న నేతల వివరాలను ఆయన తెలుసుకున్నారు. తిరువళ్లూర్ జిల్లాలో గత శాసనసభ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో విజయం సాధించామని, రాబోయే ఎన్నికల్లోనూ పార్టీ, కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేలా కృషిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు.

# 'మెట్రో'పై స్టాలిన్ రాజకీయం

- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్



అడయార్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మదురై, కోయంబత్తూరు మెట్రో రైల్ ప్రాజెక్టు ప్రతిపాదనలకు కేంద్రం అనుమతివ్వలేదంటూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ రాజకీయం చేస్తున్నారని కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఆరోపించారు. కోవై, మదురై మెట్రో రైల్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతివ్వకుండా వివక్ష చూపిస్తోందంటూ స్టాలిన్ ఆరోపించిన విషయం తెల్సిందే. ఈ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఢిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఏ ఒక్క రాష్ట్రంలోని లేని విధంగా చెన్నై మెట్రో రైల్ రెండో దశ ప్రాజెక్టుకు రూ.6326 కోట్లు కేటాయించామన్నారు. 2024 అక్టోబరులో కేంద్రం ఇచ్చిన అనుమతులను ముఖ్యమంత్రి స్టాలిన్ విస్మరించి, 2017లో ప్రతిపాదనలను ఆధారంగా చేసుకుని కోవై, మదురై మెట్రో ప్రాజెక్టులను రాజకీయం చేస్తున్నారని, ఇది దురదృష్టమన్నారు. కోవై, మదురై మెట్రో రైల్ ప్రాజెక్టులకు అనేక లోటుపాట్లున్నాయన్నారు. చెన్నైతో పోల్చితే కోయంబత్తూరులో మెట్రో ప్రాజెక్టు దూరం చాలా తక్కువని, కానీ, అధిక మొత్తంలో రవాణా సదుపాయాలను ప్రతిపాదించారన్నారు. కోవై మెట్రో ప్రాజెక్టు కోసం ప్రతిపాదించిన ఏడు మార్గాల్లో సరైన స్థలం కూడా లేదన్నారు. అదే విధంగా ప్రతిపాదనల్లో కార్పొరేషన్ పరిధిలో నివసించే ప్రజల కంటే ఐదు రెట్లు ఎక్కువ నివసిస్తున్నట్టు చూపించారన్నారు. అలాగే, తమిళనాడుకు పది వేల ఎలక్ట్రిక్ బస్సులు ఇచ్చే కేంద్రప్రభుత్వ పథకంలో రాష్ట్రాన్ని చేరేందుకు సీఎం స్టాలిన్ ప్రభుత్వం నిరాకరించిందని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ వెల్లడించారు.

## 'మెట్రో' అడ్డుకునేందుకు డీఎంకే కుట్ర

- బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్



మీడియాతో మాట్లాడుతున్న నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రకటించిన మెట్రో రైలు పథకం కోవై, మదురై ప్రాంతాల్లో అమలుకాకుండా అడ్డుకునేందుకు డీఎంకే ప్రభుత్వం కుట్ర పన్నిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. తిరునల్వేలిలో గురువారం జరిగిన సమావేశంలో పాల్గొన్న నయినార్ నాగేంద్రన్ మీడియాతో మాట్లాడుతూ, కోవై, మదురై ప్రాంతాల్లో మెట్రో రైలు పథకం అమలు జరగకుండా అడ్డుకునే ప్రయత్నాల్లో భాగంగా సీఎం స్టాలిన్ అసత్యం మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. కోవై, మదురై ప్రాంతాల్లో వచ్చే ఏడాది జూన్‌లోగా మెట్రో రైలు పథకం పనులను కేంద్ర ప్రభుత్వ సహకారంతో తప్పకుండా ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# నేటినుంచి తీర ప్రాంతాల్లో వర్షాలు

- వాతావరణ పరిశోధన కేంద్రం

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చాయి. ఈ పరిస్థితుల్లో, నైరుతి బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడింది. ఈ కారణంగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో శుక్రవారం నుంచి ఈ నెల 25వ తేది వరకు ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ ప్రకారం కడలూరు, నాగపట్టణం, తిరువారూరు. మైలాడుదురై, రామనాథపురం, విరుదునగర్, తెన్‌కాశి, కన్నియాకుమారి, తూత్తుకుడి, తిరునల్వేలి తదితర జిల్లాల్లో శుక్రవారం భారీవర్షాలు కురిసే అవకాశముంది. అలాగే, కడలూరు, మైలాడుదురై, నాగపట్టణం, తిరువారూరు, తంజావూరు, పుదుకోట, శివగంగ, రామనాథపురం, తూత్తుకుడి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో ఈ నెల 22,23 తేదీల్లో భారీవర్షాలు కురిసే అవకాశముంది. మైలాడుదురై, నాగపట్టణం, తిరువారూరు, తంజావూరు, పుదుకోట జిల్లాల్లో ఈ నెల 24, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, నాగపట్టణం, తిరువారూరు, తంజావూరు, పుదుకోట జిల్లాల్లో ఈ నెల 25వ తేది భారీవర్షాలు కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది.

# తీరప్రాంత గ్రామాల్లో 'సాగర్ కవచ్' ప్రారంభం



సాగర్ కవచ్‌లో తీరప్రాంత భద్రతా దళాలు - జాలర్ల సాయంతో సముద్రంలోకి వెళ్తున్న భద్రతా సిబ్బంది

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రెండు రోజుల 'సాగర్ కవచ్' గురువారం ప్రారంభమైంది. చెంగల్పట్టు జిల్లా కోవలం బీచ్, మహాబలిపురం బీచ్, కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రం తదితర ప్రాంతాల్లో తీరప్రాంత భద్రత దళం ఇందులో పాల్గొన్నారు. 2008లో సముద్ర మార్గం గుండా ముంబైలో ప్రవేశించిన ఉగ్రవాదులు దాడులకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో, తీరప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేసేలా ప్రతి ఏడాది 'సాగర్ కవచ్' పేరుతో మాక్ డ్రిల్ నిర్వహిస్తుంటారు. ఇందులో, కోస్ట్‌గార్డ్ సిబ్బంది ఉగ్రవాదుల వేషంలో డమ్మీ బాంబులు, తుపాకులతో రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోకి ప్రవేశిస్తారు. భద్రతా దళాలు బృందాలుగా ఏర్పడి ఉగ్రవాదులను అడ్డుకొనేలా మాక్ డ్రిల్ చేపడుతుంటారు. ఈ ప్రకారం ఈ ఏడాది సాగర్ కవచ్ గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. ముందుగా ఈసీఆర్ రోడ్డులో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. కోవలం బీచ్, మహాబలిపురం ఆలయం, కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రం చెంగల్పట్టు జిల్లాలోని తీరప్రాంతాల్లో సముద్రతీర భద్రతా దళం స్థానిక జాలర్ల సహాయంతో పడవల్లో సముద్రంలోకి వెళ్లి, కొత్త వ్యక్తుల ప్రవేశం ఉందా? అనే విషయం పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటల వరకు ఈ భద్రతా చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# తమిళనాట మరో రాజకీయ పార్టీ

'ద్రావిడ వెట్రి కళగం' పేరిట ప్రారంభించిన మల్లై సత్య





పార్టీ ప్రారంభోత్సవంలో మల్లై సత్య తదితరులు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'ద్రావిడ వెట్రి కళగం' పేరుతో మల్లై సత్య కొత్త పార్టీ ప్రారంభించారు. ఎండీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఉన్న మల్లై సత్యకు, పార్టీ అధిష్ఠానానికి మధ్య అభిప్రాయ బేధాల కారణంగా ఆయనను పార్టీ నుంచి తొలగించారు. ప్రస్తుతం ఆయన తన మద్దతుదారులతో చర్చించి కొత్త పార్టీ ప్రారంభించనున్నట్లు ఇటీవల ప్రకటించారు. ఆ ప్రకారం మల్లై సత్య 'ద్రావిడ వెట్రి కళగం' పేరుతో కొత్త పార్టీ ప్రారంభించారు. స్థానిక అడయార్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో, పార్టీ చీఫ్ కో-ఆర్డినేటర్‌గా మల్లై సత్య ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆయన ఇప్పటికే పార్టీ జెండా పరిచయం చేశారు. ద్రావిడులకు సేవ చేయడం ద్రావిడ పార్టీలకు మాత్రమే సాధ్యమవుతుందని ఈ సందర్భంగా మల్లై సత్య తెలిపారు.

# 12 నుంచి ప్రత్యేక పార్శిల్ రైలు సేవలు ప్రారంభం

- మొదటి సారిగా రాయపురం నుంచి మంగళూరుకు



రాయపురం రైల్వే స్టేషన్

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపురం నుంచి కేరళ రాష్ట్రం మీదుగా, కర్ణాటక రాష్ట్రం మంగళూరుకు ప్రత్యేక వారాంతపు పార్శిల్ సేవలు డిసెంబ రు 12 నుంచి ప్రారంభం కానున్నాయి. దక్షిణ రైల్వే పరిధిలో మొదటి సారిగా పార్శిల్ రైలు సేవలు ప్రారంభం కానుండడం విశేషం. మంగళూరు సెంట్రల్ నుంచి డిసెంబరు 12న బయల్దేరే రైలు మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు రాయపురం చేరుకుంటుంది. రాయపురం నుంచి ప్రతి మంగళవారం మధ్యాహ్నం 3.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 2.20 గంటలకు మంగళూరు సెంట్రల్ చేరుకుంటుంది. దుస్తులు, మోటారు విడిభాగాలు, ఉక్కు ఉత్పత్తులు, చేపలు వంటి వాటిని రవాణా చేసేందుకు ఈ రైలు సౌకర్యంగా ఉంటుందని దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. సేలం, ఈరోడ్, ఊత్తుకులి, తిరుప్పూర్, కోయంబత్తూర్, కోళికోడ్ తదితర ముఖ్యమైన రైల్వేస్టేషన్లలో ఈ రైలుకు లోడింగ్, అన్‌లోడింగ్‌కు వసతులు ఏర్పాటుచేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం



మృతులు దినేష్, సాజన్, బాలమురుగన్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాణిపేట సమీపంలో కారు-బైక్ ఢీకొన్న ఘటన లో ముగ్గురు యువకులు మరణించారు. రాణిపేట సమీపం నవల్‌పూర్‌కారై జంక్షన్ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన రైల్వే వంతెనపై వేగంగా వచ్చిన కారు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌లో ప్రయాణిస్తున్న దినేష్ (20), సాజన్ (26), బాలమురుగన్ (19)లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వాలాజాపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్న ముగ్గురు మృతిచెందారు. రాణిపేట పోలీసులు కేసు నమోదుచేసి కర్ణాటక రిజిస్ట్రేషన్ ఉన్న కారు డ్రైవర్ కునుకు తీయడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## బిహార్ సీఎం నితీశ్‌కు ఈపీఎస్ శుభాకాంక్షలు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బిహార్ ముఖ్యమంత్రిగా 10వ సారి బాధ్యతలు చేపట్టిన నితీశ్‌కుమార్‌కు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన బిహార్ శాసనసభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించింది. ఆ కూటమిలోని జనతాదళ్ నాయకుడు నితీశ్ కుమార్ గురువారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నితీశ్‌కుమార్ పలు పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి తన ఎక్స్ పేజీలో నితీశ్ కుమార్, ఎన్డీఏ కూటమికి నా శుభాకాంక్షలు, ఈ కొత్త తీర్పు ప్రజల విశ్వాసం, అభివృద్ధి పట్ల వారి కోరికను ప్రతిబింబిస్తుంది. అభివృద్ధి దిశగా కొత్త ప్రభుత్వం పనిచేయాలని, కొత్త ప్రభుత్వానికి అన్నాడీఎంకే తరపున అభినందనలు తెలుపుతున్నట్లు ఈపీఎస్ ట్వీట్ చేశారు.

# ఓటర్ల జాబితా నుంచి మృతుల పేర్లు తొలగించడం తప్పా?

- మహాధర్నాలో డీఎంకేను ప్రశ్నించిన అన్నాడీఎంకే

ప్యారీస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో మృతుల పేర్లను తొలగించడం తప్పా అని డీఎంకేను అన్నాడీఎంకే ప్రశ్నించింది. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సర్ కార్యక్రమంలో డీఎంకే నేతల అవకతవకలను తప్పుపడుతూ ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే ఆధ్వర్యంలో గురువారం ఎగ్మూర్ రాజరత్నం స్టేడియంలో మహాధర్నా జరిగింది. మాజీమంత్రులు డి.జయకుమార్, పి.వలర్మతి, గోకుల ఇందిరా, జిల్లా కార్యదర్శులు, ఎన్. బాలగంగా, ఆదిరాజారామ్, విరుగై రవి, టి.నగర్ సత్య, ఎంకే అశోక్, కందన్, పురసై వీఎస్‌బాబు, ప్రిసీడియం కార్యదర్శి రాయపురం ఆర్. మనో, హార్బర్ ప్రాంతీయ కార్యదర్శి వెట్రిమారిముత్తు సహా యువజన, విద్యార్థి, మహిళా, కార్మిక, వైద్య తదితర అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ధర్నాలో డి.జయకుమార్ మాట్లాడుతూ 2002వ సంవత్సరం కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో నిర్వహించిన ఎస్ఐఆర్ పనులను స్వాగతించిన డీఎంకే ప్రస్తుతం వ్యతిరేకించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఓటరు జాబితా నుండి మృతుల పేర్లు, హౌస్ షిఫ్టింగ్ పేర్లు, డెబల్ ఎంట్రీలు, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన వారి పేర్లను తొలగించాలని అన్నాడీఎంకే పలుమార్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం సర్‌లో మృతుల పేర్లు, అనర్హుల పేర్లను తొలగించడంలో తప్పేముందని, ఇప్పటికైనా ప్రజలను తప్పుదారి మళ్లించే ప్రయత్నాలు అధికార పార్టీ మానుకోవాలన్నారు. డీఎంకే ప్రభుత్వానికి ఇక నాలుగు అమావాస్యల గడువు మాత్రమే మిగిలి ఉందని, ఐదవ అమావాస్య వచ్చేలోపు అన్నాడీఎంకే రాష్ట్రపగ్గాలు చేపడుతుందని జయకుమార్ ధీమా వ్యక్తం చేశారు.



ధర్నాకు తరలివచ్చిన కార్యకర్తలు



వేదికపై మాట్లాడుతున్న నేతలు

## సమాచార దృష్టి

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా తరమణి పరిధి లోని ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో తరమణి పరిధిలోని దిగువ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

**తరమణి:** ఎంజీఆర్ రోడ్డు, శాంతియప్పన్ రోడ్డు, కోదండరామన్ వీధి, పెరుంగుడి, ఓఎంఆర్, కామరాజర్ నగర్, కురింజి నగర్, అన్నానెడుంజ నగర్, నెహ్రూ నగర్, కొట్టివాక్కం, శ్రీనివాస నగర్, జయేంద్ర కాలని, తిరువళ్లువర్ వీధి, కర్పగ వినాయగర్ వీధి, టెలిఫోన్ నగర్, చర్చి రోడ్డు, సీబీఐ కాలని.

### ఆన్‌లైన్‌లో ఓటర్ల వివరాలు నమోదు

ప్యారీస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 234 నియోజకవర్గాల్లో ప్రస్తుతం సర్ పనులు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో, ఆన్‌లైన్‌లో 1.11కోట్ల ఓటర్ల వివరాలు అప్‌డేట్ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 2026 అసెంబ్లీ ఎన్నికల దగ్గర పడుతున్న నేపథ్యంలో, రాష్ట్రంలో సర్ పనులను ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఇందులో తొలివిడతగా అర్హులైన ఓటర్లను ఎంపిక చేస్తున్నారు. బుధవారం వరకు 6.10 కోట్ల ఓటర్లకు దరఖాస్తు ఫారాలు పంపిణీ అయ్యాయి. వీటిలో పూర్తిచేసిన 1.11 కోట్ల ఫారాల్లోని వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసినట్లు ఈసీ తెలిపింది.

### రేపటి నుంచి 'ప్రత్యేక బస్సులు'

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... వారాంతపు సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం శుక్ర, శనివారాల్లో ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు తెలిపింది. కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు శుక్రవారం (ఈ నెల 21వ తేది) 340, శనివారం 350 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 55 బస్సులు, మాధవరం టెర్మినల్ నుంచి శుక్ర, శనివారాల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఇవి మినహా, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ తదితర నగరాల నుంచి పలు ప్రాంతాలకు వంద ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

### 'చెన్నై వన్' యాప్ ద్వారా పది లక్షల టిక్కెట్ల విక్రయం

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రో, సబర్బన్ రైళ్లు, ఎంటీసీ బస్సుల్లో, ఒకే టిక్కెట్టుతో ప్రయాణించే సదుపాయం కల్పించారు. అందుకోసం 'చెన్నై వన్' అనే యాప్‌ను సెప్టెంబరు 22న పరిచయం చేశారు. ఈ యాప్ ప్రారంభించనప్పటి నుంచి బుధవారం వరకు 10 లక్షల టిక్కెట్లు విక్రయమైనట్లు అధికారులు తెలిపారు. ఎంటీసీ బస్సుల్లో ప్రయాణించే వారు మాత్రమే 70 శాతం టిక్కెట్లు కొనుగోలు చేశారు. చిల్లర సమస్య లేకుండా ఎంటీసీ బస్సుల్లో వెళ్లేందుకు ప్రయాణికులు అధికంగా ఈ యాప్‌ను వినియోగిస్తున్నారని అధికారులు తెలిపారు.

### జనవరి 28న మహల్లా-జమాయత్ మహానాడు

ప్యారీస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ఆధ్వర్యంలో జనవరి 28న తంజావూరు జిల్లా కుంభకోణం స్వామిమలైలో మహల్లా-జమాయత్ మహానాడు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖాదర్ మొహిద్దీన్ ప్రకటించారు. తిరుచ్చిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్ పనులను వ్యతిరేకిస్తూ తమ పార్టీ తరుపున సుప్రీంకోర్టులో, కేరళ హైకోర్టులో కేసు వేశామని, బిహార్‌లో లాగే సమస్యలు రాకూడదనే ఆలోచనతోనే తాము న్యాయస్థానాలను ఆశ్రయించినట్లు వివరించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో ఉన్న తమ పార్టీకి మూడు నియోజకవర్గాల్లో సీట్లు కేటాయించారని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు సీట్లు కేటాయించాల్సిందిగా సీఎం స్టాలిన్‌ను కోరనున్నట్లు తెలిపారు. మహల్లా-జమాయత్ మహానాడులో సీఎం స్టాలిన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు.

### మధురవాయల్ ఆరోగ్య కేంద్రం చిరునామా మార్పు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని వలసరవాక్కం మండలం 144వ వార్డు మధురవాయల్-పూందమల్లి హై రోడ్డులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనిచేస్తోంది. స్థలాభావం, పాత భవనం కావడంతో, కొత్త భవనం నిర్మాణానికి రూ.1.80 కోట్లు కేటాయించారు. అందువల్ల, పాత భవనం కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. ఒకే స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించనున్నారు.. ఈ క్రమంలో, ప్రస్తుతమున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మధురవాయల్ ఎంఎండీఏ కాలనిలోని వెల్‌నెస్ ప్రాంగణానికి తాత్కాలికంగా మార్చినట్లు జీసీసీ అధికారులు తెలిపారు.

### ఆవడి కార్పొరేషన్‌లో రూ.42 కోట్ల పన్ను వసూలు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆవడి కార్పొరేషన్‌లో నాలుగు మండలాల పరిధిలోని 48 వార్డుల్లో 92,300 మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఉన్నారు. వీరి నుంచి కార్పొరేషన్ ప్రతి ఏడాది రూ.81.60 కోట్ల ఆదాయం వస్తోంది. ఈ క్రమంలో, 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధవార్షికంలో రూ.40 కోట్లు వసూలుచేయాలని కార్పొరేషన్ లక్ష్యంగా నిర్ణయించింది. ఆ ప్రకారం, తొలి అర్ధవార్షికంలో రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లు జరిగాయి. అలాగే, రెండో అర్ధవార్షిక పన్ను వసూళ్లు గత నెలలో ప్రారంభమయ్యాయి. ఆ ప్రకారం, గత నెల 1వ తేది నుంచి బుధవారం వరకు రూ2 కోట్ల మేర పన్ను వసూలైంది. రెవెన్యూ శాఖలో ఉద్యోగులు తక్కువగా ఉన్న నేపథ్యంలో, జనవరి నుంచి నవంబరు వరకు, లక్ష్యాన్ని అధికమించి రూ.42 కోట్ల పన్నులు వసూలు చేసినట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

# డంపింగ్ యార్డు వద్దంటూ ప్రజల ఆందోళన


రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న ప్రజలు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ కార్పొరేషన్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరుతూ ప్రజలు వినూత్న ధర్నా చేపట్టారు. తిరుప్పూర్ కార్పొరేషన్‌లో 60 వార్డులుండగా, ప్రతిరోజు సుమారు 800 టన్నుల చెత్త సేకరిస్తుంటారు. తిరుప్పూర్ నుంచి సుమారు 8 కి.మీ దూరంలోని ముదలిపాళయం పారైకుళి ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. కార్పొరేషన్ నిర్ణయంపై పారైకుళి, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో, పారైకుళిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు ఉపసంహరించుకోవాలని కోరుతూ బుధవారం ఉదయం ఆ ప్రాంత ప్రజలు కార్పొరేషన్ కార్యాలయం ముందు ఉన్న రోడ్డుపై పడుకుని ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో పాల్గొన్న 90 మంది మహిళలు సహా 150 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు, సమీపంలోని కల్యాణ మండపానికి తరలించి సాయంత్రం విడుదల చేశారు. కార్పొరేషన్ తన నిర్ణయం ఉపసంహరించుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఆ ప్రాంత ప్రజలు హెచ్చరించారు.

### 23న సెంట్రల్-అరక్కోణం మార్గంలో సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్-అరక్కోణం మార్గంలో ఈ నెల 23వ తేది (ఆదివారం) 49 సబర్బన్ రైళ్లు రద్దు చేశారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో.. తిరునింద్రవూర్ రైల్వే యార్డులో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3.40 గంటల వరకు సబర్బన్ రైళ్లు రద్దు కానున్నాయి.

- చెన్నై బీచ్ నుంచి ఉదయం 5.40, 6.10, 9.55, మధ్యాహ్నం 1.05 గంటలకు తిరువళ్లూర్ వెళ్లే రైళ్లు, బీచ్ నుంచి మధ్యాహ్నం 2.25 గంటలకు అరక్కోణం వెళ్లే రైలు, బీచ్ నుంచి మధ్యాహ్నం 12.10 గంటలకు తిరుత్తణికి వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు.
- సెంట్రల్ నుంచి ఉదయం 6.50, 11.45, మధ్యాహ్నం 2.15 గంటలకు తిరుత్తణికి వెళ్లే రైళ్లు, మధ్యాహ్నం 12.40, 1.25 గంటలకు అరక్కోణం వెళ్లే రైళ్లు, ఉదయం 1.30 గంటలకు కడంబత్తూర్ వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు.
- అరక్కోణం నుంచి ఉదయం 6.40, 7.10, 11.15, మధ్యాహ్నం 12, 1.40 గంటలకు సెంట్రల్ బయల్దేరే రైళ్లు, తిరునింద్రవూర్ నుంచి ఉదయం 7.55 గంటలకు సెంట్రల్ వెళ్లే రైలు, తిరుత్తణి నుంచి మధ్యాహ్నం 12.35 గంటలకు సెంట్రల్ వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు.
- ఎన్నూర్ నుంచి ఉదయం 5.35 గంటలకు తిరువళ్లూర్ వెళ్లే రైలు, తిరువళ్లూర్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు ఆవడి వెళ్లే రైలు, కడంబత్తూర్ నుంచి మధ్యాహ్నం 12.05 గంటలకు చెన్నై బీచ్‌కు వెళ్లే రైలు, తిరువళ్లూర్ నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు చెన్నై బీచ్ వెళ్లే రైలు, ఆవడి నుంచి ఉదయం 5 గంటలకు ఎన్నూర్ వెళ్లే రైలు అని మొత్తం 49 రైళ్లు రద్దు కానున్నాయి.
- అదే సమయంలో, చెన్నై బీచ్-సెంట్రల్ నుంచి ఆవడి, పట్టాభిరామ్ మిలిటరీ సైడింగ్‌కు వెళ్లే రైళ్లు యధావిధిగా టైంటేబుల్ ప్రకారం నడువనున్నాయి.
- ఈ నెల 23న మధ్యాహ్నం 12.10 నుంచి మధ్యాహ్నం 3.40 గంటల వరకు పట్టాభిరామ్-తిరువళ్లూర్ మధ్య సబర్బన్ రైళ్లు రద్దవుతాయి.

**17 ప్రత్యేక రైళ్లు...**

ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం 6.30, 8.20, 11 గంటలకు చెన్నై-అరక్కోణం, ఉదయం 7, 7.25, 9.10 గంటలకు సెంట్రల్-తిరుత్తణి, ఉదయం 10.45 గంటలకు సెంట్రల్-ఆవడి, ఉదయం 9.50 గంటలకు సెంట్రల్-తిరుపతి, ఉదయం 8.15, 8.55. 10 గంటలకు అరక్కోణం-సెంట్రల్, ఉదయం 7 గంటలకు తిరువళ్లూర్-సెంట్రల్, ఉదయం 10.15 గంటలకు తిరుత్తణి-సెంట్రల్, ఉదయం 6.20, 7.35, 8 గంటలకు అరక్కోణం-చెన్నై బీచ్, ఉదయం 8.50 గంటలకు తిరుత్తణి-చెన్నై బీచ్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు.

- అలాగే, ఉదయం 11.15, మధ్యాహ్నం 12.55, 1.40, 3.45 గంటలకు తిరువళ్లూర్-తిరుత్తణి, మధ్యాహ్నం 12, 12.15, 3 గంటలకు తిరువళ్లూర్-అరక్కోణం, ఉదయం 10.30, 11.15 మధ్యాహ్నం 12, 1.30, 2.15 గంటలకు అరక్కోణం-తిరువళ్లూర్, మధ్యాహ్నం 12.35 గంటలకు తిరుత్తణి-తిరువళ్లూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

### చేపల చోరీ కేసులో ఒకరి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశిమేడులో చేపలు చోరీచేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాశిమేడు జీఎం పేట ప్రాంతంలో నివసిస్తున్న మాలతి కాశిమేడు నుంచి చేపలు తీసుకొచ్చి జీఎం పేట ప్రాంతంలో విక్రయిస్తుటుంది. మాలతి ఈ నెల 16వ తేది చేపలను రూ.25వేలకు వేలం పాటలో కొనుగోలు చేసింది. చేపలను ఐస్ బాక్స్‌లో పెట్టి ఇంటి ముందుంచింది. మరుసటిరోజు చూడగా, ఐస్ పెట్టెలో చేపలు లేకపోవడంతో కాశిమేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, కొడుంగైయూర్ ఎళిల్ నగర్‌కు చెందిన నవీన్‌ను బుధవారం అరెస్ట్ చేశారు. అతనిపై ఇదివరకే ఆరు కేసులున్నట్లు పోలీసులు గుర్తించారు. నవీన్‌ను కోర్టులో హాజరుపరచిన పోలీసులు, న్యాయమూర్తి ఉత్తర్వులతో జైలుకు తరలించారు.

### 70 ఏళ్ల కార్మికుడికి రూ.1.5 కోట్ల జీఎస్టీ నోటీసు

● పింఛన్ నిలిపివేసిన అధికారులు


వేలాయుధం

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిలో వున్న 70 ఏళ్ల వృద్ధుడికి అధికారులు. రూ.1.5 కోట్ల జీఎస్టీ నోటీసు పంపించారు. దీంతో అతనికి రావాల్సిన పింఛను ఆగిపోయింది. తిరుపత్తూరు జిల్లా మలిగైతోపులో ఈ ఘటన జరిగిం ది. మలిగైతోపుకు చెందిన వేలాయుధం అనే కార్మికుడు అనారోగ్యం కారణంగా కొంతకాలంగా ఇంట్లోనే వుంటున్నాడు. అతని భార్య ఉష, చెప్పుల కర్మాగారంలో పనిచేస్తూ మృతిచెందింది. ఆమె పీఎఫ్ నుంచి వేలాయుధం పింఛన్ పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో, కొద్దినెలలుగా పింఛన్ జమకాకపోవడంతో, వేలాయుధం బ్యాంక్ అధికారులను సంప్రదించగా, అతడి పేరున రూ.1.50 కోట్ల జీఎస్టీ బకాయిలుండడంతో పింఛన్ నిలిపివేసినట్లు తెలిపారు. దీంతో, వేలాయుధం వేలూరులోని జీఎస్టీ కార్యాలయాన్ని సంప్రదించగా, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేసి, ఫిర్యాదు నకలు తీసుకురావాలని అధికారులు సూచించారు. దీంతో, వేలాయుధం అంబూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా వ్యవహారాన్ని ఆర్థిక నేర విభాగం లేదా చెన్నైలోనీ జీఎస్టీ కార్యాలయం మాత్రమే పరిష్కరించగలవని చేతులెత్తేశారు. దీంతో వేలాయుధం ఏం చేయాలో పాలుపోక కనిపించిన అధికారినల్లా సాయం చేయాలని వేడుకుంటున్నాడు.

### సైనికుడి ఆత్మహత్య

వేలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బెడుగత్తూర్ సమీపంలో సైనికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వడవీధి గ్రామానికి చెందిన వెంకటేశన్ కుమారుడు సంతోష్ (28) భారత సైనిక దళంలో రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఒత్తిడికి గురైన సంతోష్, స్వగ్రామానికి చేరుకుని చికిత్స పొందుతున్నాడు. బుధవారం రాత్రి సంతోష్ హఠాత్తుగా కనిపించకపోవడంతో, కుటుంబ సభ్యులు అతని కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. ఈ పరిస్థితుల్లో గ్రామ శివారులో ఓ పొలంలోని గుడిసెలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడడం గమనించారు. వేపంకుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### అస్వస్థతకు గురైన గ్రామస్తులకు ఎమ్మెల్యే పరామర్శ


గ్రామస్తులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్


తిరుత్తణి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో ఇటీవల కలుషిత నీటిని తాగడంతో ఆస్పత్రి పాలైన 30 మంది గ్రామస్తులను గురువారం తిరుత్తణి నియోజకవర్గ ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ పరామర్శించారు. మంగళవారం ఉదయం పళ్లిపట్టు పరిధీలోని ప్రాంతాల్లో కలుషిత నీరు తాగిన సుమారు 30 మంది గ్రామస్తులు ఆస్పత్రి పాలయ్యారు. సీనియర్ డాక్టర్ ధనంజయన్ నేతృత్వంలో వారికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న గ్రామస్తులను గురువారం ఉదయం ఎమ్మెల్యే చంద్రన్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ పంచాయతీల డిప్యూటీ డైరెక్టర్ జయకుమార్, ఈవో రాజ్‌కుమార్ బృందంతో తాగునీటి సమస్యపై విచారిస్తున్నామని, అదేవిధంగా కలుషితమైన ఆ నీటిట్యాంకులను శుభ్రం చేయించి, పైపులకు కూడా మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు.

### 'డిజిటల్ అరెస్ట్' పేరుతో రూ.24 లక్షల మోసం

● మైసూరుకు చెందిన ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'డిజిటల్ అరెస్ట్' పేరుతో రూ24 లక్షల మోసానికి పాల్పడిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక తండయార్‌పేటకు చెందిన చిత్రలేఖ (70) తండయార్‌పేటలోని నార్త్ జోన్ సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో అందజేసిన ఫిర్యాదులో వివరాలిలా ఉన్నాయి.. సెప్టెంబరు 25వ తేది తనకు ఫోన్ చేసిన గుర్తుతెలియని వ్యక్తి, మానవ అక్రమ రవాణా కేసులో ప్రమేయం ఉన్నందున నా ఆధార్ నెంబరు, మొబైల్ ఫోన్ బ్లాక్ చేయబోతున్నట్లు తెలిపాడు. అనంతరం వాట్సాప్ వీడియో కాల్‌లో మాట్లాడిన వ్యక్తి, తాను గాంధీ నగర్ పోలీసు మదన్‌కుమార్‌గా పరిచయం చేసుకుని, నా ఆధార్ కార్డు, సుప్రీంకోర్టు ఉత్తర్వులు అని చూపించి 'డిజిటల్ అరెస్ట్' చేయబోతున్నట్లు తెలిపాడు. అనంతరం మరో వ్యక్తి, సీబీఐ అధికారినంటూ పరిచయం చేసుకుని, నా బ్యాంక్ ఖాతాలోని నగదు, తను చెప్పిన బ్యాంక్ ఖాతాకు బదిలీ చేయాలని, విచారణ అనంతరం నగదు తిరిగి పంపిస్తామని తెలిపాడు. ఈ మాటలతో భయాందోళనలకు గురై, తన ఖాతా, తన భర్త ఖాతాల్లో ఉన్న రూ.27 లక్షలను, ఆ వ్యక్తి పేర్కొన్న బ్యాంక్ ఖాతాకు బదిలీ చేసి, ఆ తర్వాత తాము మోసపోయామని గుర్తించామని, తమ డబ్బు తిరిగి అప్పగించేలా చర్యలు చేపట్టాలని చిత్రలేఖ సైబర్ క్రైం పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో తెలియజేసింది. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు, చిత్రలేఖ నగదు పంపిన బ్యాంక్ ఖాతా నెంబరు, ఆమెకు వచ్చిన సెల్‌ఫోన్ నెంబరుపై విచారించగా, అవి కర్ణాటక రాష్ట్రం మైసూరుకు చెందినవిగా గుర్తించారు. మైసూరు చేరుకుని విచారణ చేపట్టిన సైబర్ క్రైం పోలీసులు ఆ ప్రాంతానికి చెందిన తేజాస్, ప్రణవ్, మహ్మద్ సమీర్ లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

### బాధితులకు నగదు అప్పగింత


బాధితులకు పత్రాలు అందజేస్తున్న ఏసీపీ భవానీశ్వరి

తిరువళ్లూరు, నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి): ఆవడి పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలు మోసాల్లో బాధితులు కోల్పోయిన రూ.4.82 కోట్ల నగదును తిరిగి అప్పగించారు. భూ మోసం, డ్యాక్యుమెంట్ మోసం, ఉద్యోగం పేరిట నగదు తీసుకొని మోసం చేశారని తదితరాలపై ఆవడి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులను కేంద్ర నేరవిభాగం అదనపు డిప్యూటీ కమిషనర్ స్టీఫెన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విచారణ చేపట్టింది. ఈ ఫిర్యాదుల్లో నిందితులను అరెస్టు చేసి, వారి బ్యాంక్ ఖాతాల నుంచి రూ. 4.82 కోట్ల నగదు, ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఆవడి పోలీసు కమిషనరేట్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో బాధితులకు పోలీస్ కమిషనర్ కె. శంకర్ ఉత్తర్వుల మేరకు అసిస్టెంట్ కమిషనర్ కె.భవానీశ్వరి నగదు, పత్రాలు అందించారు.

### నాగపట్నం, మైలాడుదురై టాస్మాక్ దుకాణాల్లో ఏసీబీ తనిఖీలు

● లెక్కల్లో చూపని రూ.1.6 లక్షల స్వాధీనం

ప్యారీస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగపట్నం, మైలాడుదురై జిల్లాల్లోని 17 టాస్మాక్ దుకాణాల్లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో లెక్కలో చూపని రూ.1.6లక్షలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా టాస్మాక్ సంస్థ నిర్వహిస్తున్న మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధర కంటే అదనంగా రూ.10 నుండి రూ.20 వరకు వసూలు చేయడాన్ని అడ్డుకోవాలని ప్రతిపక్షాలు పలుమార్లు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు నాగపట్నం, మైలాడుదురై జిల్లాలోని 17 మద్యం చిల్లర దుకాణాల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేసి, లెక్కలో చూపని రూ.1.6లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ అవినీతిలో సంబంధాలున్న సూపర్‌వైజర్, సేల్స్‌మెన్లను తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు టాస్మాక్ అధికారులు తెలిపారు.

### హత్యాచారం కేసులో అసోం యువకుడికి జైలుశిక్ష

అడయార్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లాలో ఎనిమిదేళ్ళ బాలికపై హత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయి అసోం యువకుడికి చనిపోయేంత వరకు జైలు శిక్ష విధిస్తూ మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ తాజాగా తీర్పునిచ్చింది. 2020, జనవరిలో జరిగిన ఈ అత్యాచార కేసులో తాజాగా తీర్పు వెలువడింది.

# మాకూ ఓటుహక్కు కల్పించండి

● అధికారులకు సంచారజాతుల విజ్ఞప్తి


మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సంచారజాతుల ప్రజలు

తిరుత్తణి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రత, ప్రభుత్వ పథకాలు తదితర సంక్షేమాలకు దూరంగా ఉన్న సంచారజాతి ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఓటు హక్కు కల్పించాలని కోరుతూ గురువారం ఆందోళన చేపట్టారు. తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో గుడారాలు వేసుకుని 30కి పైగా సంచారజాతి కుటుంబాలు పదేళ్లుగా నివసిస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపాలిటీ అధికారులు రోడ్లపై నివసిస్తున్న వారిని ఖాళీ చేయాలని గత నెలలో వారి సూచించారు. దీనిని వ్యతిరేకిస్తూ గురువారం ఉదయం పళ్లిపట్టు మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, పదేళ్లకు పైగా పళ్లిపట్టు ప్రాంతంలో నివసిస్తున్న తమను ఖాళీ చేయమని అధికారులు ఆదేశిస్తే ఉన్నపలంగా భార్యాపిల్లలతో ఎక్కడి వెళ్తామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లపై వెళుతున్న తాగుబోతులు తమపై పలుమార్లు దాడికి పాల్పడ్డారని పోలీసులకు తెలిపినా ఫలితం లేదని, ఇలాంటి కఠిన పరిస్థితుల్లో నివసిస్తున్న తమకు ప్రభుత్వం ఓటుహక్కు కల్పించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని, అదేవిధంగా సొంత ఇళ్లను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

### సేలంలో విజయ్ ప్రచారానికి అనుమతి నిరాకరణ

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ సేలంలో చేపట్టనున్న ప్రచారానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. టీవీకే అధ్యక్షుడు విజయ్, రాష్ట్రవ్యాప్త ప్రచారంలో భాగంగా సెప్టెంబరు 27వ తేది కరూర్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందారు. ఈ సంఘటన కారణంగా తన ప్రచారాన్ని విజయ్ తాత్కాలికంగా వాయిదావేశారు. ఈ క్రమంలో, ఇటీవల నగరంలో జరిగిన టీవీకే ప్రత్యేక సర్వసభ్య మండలి సమావేశంలో పాల్గొన్న విజయ్, తన రాజకీయ ప్రయాణం ఇకనుంచి వేగంగా ఉంటుందని చెబుతూ, అధికార డీఎంకేపై తీవ్ర విమర్శలు చేస్తూ ప్రసంగించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శులు, నామక్కల్, కరూర్ జిల్లాల్లో ప్రచారం చేయడం తాత్కాలికంగా వాయిదావేసి, మిగిలిన జిల్లాల్లో ప్రచారం ప్రారంభించాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ఆ ప్రకారం, సేలం నుంచి విజయ్ తన ప్రచారం మళ్లీ ప్రారంభిస్తారని సమాచారం. అందుకోసం ఆ జిల్లా నేతలు ప్రచార సభల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆ ప్రకారం, విజయ్ ప్రచార సభకు అనుమతివ్వాలని కోరుతూ గురువారం సేలం జిల్లా ఎస్పీకి టీవీకే నేతలు దరఖాస్తు చేసుకున్నారు. అందులో, డిసెంబరు 4వ తేది విజయ్ ప్రచారం ఉంటుందని, అందుకు బోస్ మైదానం, కోట మైదానం, గెజ్జలనాయకన్‌పట్టి ప్రాంతాల్లో అనుమతులివ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో, డిసెంబరు 4వ తేది విజయ్ ప్రచారానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. కార్తీక దీపోత్సవం పనులు జరుగుతున్న దృష్ట్యా, ప్రచారానికి తగిన భద్రత కల్పించలేమని, 4వ తేది తర్వాత మరేదైనా తేదీలో అనుమతిస్తామని జిల్లా పోలీసు శాఖ తెలిపిందని సేలం సెంట్రల్ జిల్లా టీవీకే కార్యదర్శి పార్తీపన్ తెలిపారు.

### బస్సు చక్రం కింద పడి బాలుడి మృతి


దుర్‌శాంత్ (ఫైల్‌ఫొటో)

వేలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బస్సు చక్రం కింద చిక్కుకుని బాలుడు మృతిచెందిన ఘటన వాణియంబాడి సమీపంలో చోటుచేసుకుంది. కావలూరు కృష్ణాపురం ప్రాంతానికి చెందిన వేలు-తిలకవతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, దుర్‌శాంత్ అనే ఏడాదిన్నర కుమారుడున్నారు. ఘటన జరిగిన రోజున తిలకవతి ఇద్దరు కుమార్తెలను పాఠశాలకు పంపేందుకు స్కూల్ బస్సు ఎక్కించింది. తల్లితో పాటు వెళ్లిన కుమారుడు, హఠాత్తుగా బస్సు చక్రం కింద చిక్కుకుని మృతిచెందాడు. ఈ ఘటనపై ఆలంగాయం పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

### శ్రీలంక శరణార్థుల గృహాల పరిశీలన


గృహ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతాప్, ఎమ్మెల్యే తదితరులు

తిరువళ్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక శరణార్థుల కోసం గుమ్మిడిపూండిలో నిర్మిస్తున్న గృహాలను తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఎం.ప్రతాప్, గుమ్మిడిపూండి ఎమ్మెల్యే టి.జె.గోవిందరాజన్‌తో కలిసి తనిఖీ చేశారు. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి తాలూకా పెత్తికుప్పంలోని శ్రీలంక శరణార్థుల పునరావాస శిబిరంలో ఉన్న వారి కోసం తమిళనాడు ప్రభుత్వం 198 గృహాలను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో, త్వరలోనే గృహాలు లబ్దిదారులకు అందజేయనున్నారు. ఈ పనులను గురువారం కలెక్టర్ ప్రతాప్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణాలు నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని, పనుల్లో నాణ్యత లోపిస్తే తగిన చర్యలు చేపడతామని కాంట్రాక్టర్‌ను కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఈఈ రాజవేల్, ఏఈఈ గజలక్ష్మి, అధికారులు, డీఎంకే నాయకులు పాల్గొన్నారు.

### వినియోగదారుల హక్కులపై అవగాహన


సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో, వినియోగదారుల సమస్యలు, హక్కులు తదితరాలను విద్యార్థులకు వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శివసుబ్రమణ్యం, రాష్ట్ర వినియోగదారుల సంఘం మండల మేనేజర్ విజయలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల అధికారి శరవణన్, ఆహార భద్రత శాఖ అధికారి డా.ప్రభాకరన్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

### ఈడీ కేసుల విచారణకు ప్రత్యేక న్యాయవాదుల నియామకం

ప్యారీస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రత్యేక కోర్టుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన కేసుల్లో వాదించేందుకు 13 మంది ప్రత్యేక ప్లీడర్లు నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయస్థానాలు, నగరంలో ఉన ప్రత్యేక కోర్టుల్లో అవినీతి, మనీల్యాండరింగ్ తదితర కేసులు విచారణ స్థాయిలో ఉన్న నేపథ్యంలో, ఈ కేసుల విచారణకు హాజరయ్యేందుకు సీనియర్ న్యాయవాదులు వి.లోకేష్, ఎస్.రామ్మూర్తి, జి.ప్రభు, కె.ఎతిరాజులు, మిరా జ్ఞానశేఖర్ సహా 13 మందిని నియమించినట్లు ఈడీ ఓ ప్రకటనలో తెలిపింది.

### తిరుచ్చి ప్రత్యేక శిబిరంలో గొడవ

● 11 మంది విదేశీయులపై కేసు నమోదు

ప్యారీస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చిలోని ప్రత్యేక శిబిరంలో ఉన్న విదేశీయుల్లో కొందరు తమను తమ దేశానికి పంపించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించి ఫర్నిచర్ ధ్వంసం చేసిన వ్యవహారంలో 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విదేశాల నుండి రాష్ట్రానికి పర్యాటక వీసాల్లో వచ్చి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన విదేశీయులను అరెస్టు చేసి తిరుచ్చి కేంద్ర కారాగార ప్రాంగణంలోని ప్రత్యేక శిబిరానికి తరలిస్తుంటారు. ఈ శిబిరంలో ప్రస్తుతం నైజీరియా, యుగాండా, తదితర దేశాలకు చెందిన 150 మందికి పైగా ఉన్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం నైజీరియాకు చెందిన మహిళా ఖైదీలు సహా 11 మంది తక్షణమే తమ దేశాలకు పంపించాలని డిమాండ్ చేస్తూ శిబిరంలో ఫర్నిచర్ ధ్వంసం చేశారు. జైలు అధికారుల ఫిర్యాదు మేరకు తిరుచ్చి కేకేనగర్‌కు చెందిన పోలీసులు మొత్తం ఇద్దరు మహిళలు సహా 11 మంది విదేశీయులపై కేసు నమోదు చేశారు.

### రాత్రి సబర్బన్ సర్వీసులు పునరుద్ధరించాలి

అడయార్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ నుంచి గుమ్మిడిపూండి, అరక్కోణం ప్రాంతాలకు నడిచే సబర్బన్ నైట్ సర్వీసులను తిరిగి పునురుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇదే విషయంపై రైలు ప్రయాణికుల సంఘం కార్యదర్శి ధనుష్కోడి మాట్లాడుతూ, అరక్కోణం, గుమ్మిడిపూండి మార్గాల్లో నిలిపివేసిన నైట్ సర్వీసులను తిరిగి ప్రారంభించాలని కోరారు. అర్ధరాత్రి విధులు పూర్తి చేసుకునే కార్మికులకు ఈ రైలు సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. అందువల్ల నైట్ సర్వీసులను తిరిగి ప్రారంభించాలని దక్షిణ రైల్వేకు విజ్ఞప్తి చేశారు.

### 41 మంది ప్రాణాలు పోయినా ఇప్పటికీ నోరు మెదపడం లేదు

● విజయ్‌పై ప్రేమలత ఆగ్రహం

అడయార్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో టీవీకే ప్రచార సభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయినప్పటికీ ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ నోరు మెదపకపోవడం ఎంతో వేదనకు గురిచేస్తోందని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఆరోపించారు. 'ఉల్లం తేడి ఇల్లం నాడి' అనే పేరుతో ఆమె రాష్ట్ర పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా దిండుగల్ జిల్లా వేడచందూర్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ, రానున్న అసెంబ్లీ ఎన్నికలు తమ పార్టీ బలాన్ని నిరూపించుకునే పరీక్షలన్నారు. వచ్చే ఎన్నికల్లో తమతో పొత్తు పెట్టుకునేందుకు పలు పార్టీలు పోటీ పడుతున్నాయన్నారు. కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించినా, ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ మాత్రం ఇప్పటివరకు నోరు మెదపడం లేదని, గతంలో విజయకాంత్ జీవించివున్నపుడు జరిగిన తమ పార్టీ మహానాడులో చిన్నపాటి తొక్కిసలాట జరిగితే విజయ్‌కాంత్ క్షేత్రస్థాయికి వెళ్ళి దాన్ని ఆపారని ఆమె గుర్తు చేశారు.

# సైకలాజికల్ థ్రిల్లర్‌గా 'స్టీఫెన్'



'స్టీఫెన్'లో గోమతి శంకర్

ఎన్నో మలుపులు, రహస్యాలతో కూడిన సైకలాజికల్ థ్రిల్లర్‌గా 'స్టీఫెన్' మూవీ డిసెంబరు 5వ తేదీ నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. నూతన దర్శకుడు మిథున్ బాలాజీ కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. గోమతి శంకర్ ప్రధాన పాత్ర పోషించారు. ఈ చిత్ర విశేషాలను దర్శకుడు వివరిస్తూ 'స్టీఫెన్' మూవీ సీరియల్ కిల్లర్ కథ. సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందించాం. ఈ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు ధన్యవాదాలు. గోమతి శంకర్ స్క్రిప్టులో లీనమైపోయారు. ఈ మూవీని 190కి పైగా దేశాల అభిమానులు నెట్‌ఫ్లిక్స్‌లో చూడొచ్చు. అని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్ మాట్లాడుతూ, 'దక్షిణ భారత చిత్రపరిశ్రమలో మంచి కథలతో కూడిన నాణ్యమైన చిత్రాలను అందించాలన్నదే మా ఏకైక లక్ష్యం. ఆ విధంగా ఎంచుకున్న అత్యుత్తమ కథల్లో 'స్టీఫెన్' ఒకటి. అనేక మలుపులతో ఆసక్తికరంగా సాగే ఒక సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ. డిసెంబరు 5 నుంచి స్ట్రీమింగ్ అవుతుంది' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి



'సర్వం మాయ' ఫస్ట్‌లుక్

## 'సర్వం మాయ' అంటున్న నవిన్ పోలీ

నటుడు నవిన్ పోలీ హీరోగా నటించిన తాజా చిత్రం 'సర్వం మాయ'. అఖిల్ సత్యన్ దర్శకత్వం వహించారు. క్రిస్మస్‌కు ప్రపంచ వ్యాప్తంగా విడుదలకానుంది. నవిన్ పోలీ, అజు వర్గీస్, ప్రముఖ నటుడు జనార్ధనన్ తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు. ఫైర్ ఫ్లై ఫిలిమ్స్ పతాకంపై నిర్మించగా, తాజాగా రిలీజ్ చేసిన పోస్టరులో నవిన్ పోలీ, అజు వర్గీస్, జనార్ధనన్ లుక్ ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. కామెడీ - ఫ్యామిలీ డ్రామా మూవీలు అమితంగా ఇష్టపడే ప్రేక్షకులు ఈ చిత్రాన్ని బాగా ఇష్టపడతారని, అందుకే ఫ్యామిలీ ఆడియన్స్‌ను దృష్టిలో ఉంచుకుని, క్రిస్మస్ సెలవుల్లో విడుదల చేయాలని నిర్ణయించినట్టు దర్శకుడు వివరించారు.

# హింస లేకుండా సినిమాలు తీయలేరా?



ఆడియో రిలీజ్ వేడుక

● తోల్ తిరుమావళవన్

హింస లేకుండా సినిమాలు నిర్మించలేరా? అని డీపీఐ ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్ ప్రశ్నించారు. వైట్‌స్క్రీన్ ప్రొడక్షన్స్ బ్యానరుపై కమల్ జీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నెల్లై బాయిస్'. అరివళగన్, హేమా రాజ్‌కుమార్, వేల రామమూర్తి తదితరులు ప్రధాన పాత్రలను పోషించిన ఈ మూవీ ఆడియో రిలీజ్ వేడుక తాజాగా నగరంలో జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న తిరుమావళన్ ఆడియో రిలీజ్ చేసి మాట్లాడుతూ, 'చిన్న బడ్జెట్ చిత్రాలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. చిన్న నిర్మాతలు భారీ స్థాయిలో పబ్లిసిటీ చేసుకోలేని స్థితిలో ఉన్నారు. అలాంటి సినిమాల జాబితాలో ఇదొకటి. ఈ సినిమా కథ ఏంటో నాకు తెలియదు. కానీ, సినిమా టైటిల్ అక్షరాల్లోనే కత్తులు, కటార్లు కనిపిస్తున్నాయి. నెల్లై అనగానే కత్తులు ప్రతిబింబించాలా? ఒక సినిమా హింస లేకుండా తీయలేమా? అనే ప్రశ్న సుదీర్ఘకాలంగా నన్ను వేధిస్తోంది. సినిమాల్లో చూపించినట్టుగా సమాజంలోని ప్రజల్లో కూడా ఇలాంటి సంస్కృతి ఉందా? అనే సందేహం కలుగుతోంది. దర్శకుల ఆలోచనా విధానంలో మార్పులు రావాలి. ఒక హీరో అంటే దాదాయిజం, రౌడీయిజం చూపిస్తేనే హీరోనా? నెల్లై అంటే అనేక విద్యా సంస్థలు, పరిశ్రమలు, పరిశోధకులు, న్యాయకోవిదులు, విద్యావేత్తలకు నిలయం. అనేక గొప్ప విషయాలు ఇమిడివున్నాయి. దక్షిణాది జిల్లాలు లేదా నెల్లై అంటేనే కత్తి (అరివాల్) సంస్కృతి అని ప్రతిబింబించేలా సినిమాలు నిర్మిస్తున్నారు. ఈ విధానం మారాలని పేర్కొన్నారు.



ఆడియో రిలీజ్ వేడుకలో భాగ్యరాజ్, చిత్ర బృందం సభ్యులు

# ఆది తమిళుడి తొలి వాయిద్యం డప్పు

● కె.భాగ్యరాజ్

ఆది తమిళుడి మొదటి సంగీతం వాయిద్యం తప్పెట (డప్పు) అని ప్రముఖ సీనియర్ నటుడు, దర్శకుడు, సంగీత దర్శకుడు కె.భాగ్యరాజ్ అన్నారు. సియా ప్రొడక్షన్స్ పతాకంపై శుభ, సురేష్ రామ్ నిర్మాణంలో డెబ్యూ డైరెక్టర్ ఎస్.విజయ్ కుమార్ రూపొందించిన చిత్రం 'మాన్బు మిగు పరై'. దిండుగల్ లియోనీ కుమారుడు లియో శివకుమార్ హీరోగా నటించారు. తప్పెట (డప్పు) వాయిద్యం గొప్పతనాన్ని వివరించేలా ఈ సినిమా రూపొందించగా, వచ్చే నెల 12న విడుదల చేయనున్నారు. దీన్ని పురస్కరించుకుని చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక నగరంలో తాజాగా జరిగింది. ఇందులో సినీ రాజకీయ ప్రముఖులు తోల్ తిరుమావళవన్, దిండుగల్ లియోనీ, సినీ దర్శక హీరో కె.భాగ్యరాజ్, నిర్మాతలు మురళి, అన్బు సెల్వన్, సంగీత దర్శకులు దేవా, సబేష్ మురళి, శ్రీకాంత్ దేవా, నటి గాయత్రి, దర్శకులు వెంకటేష్, గణేష్ బాబు, డప్పు వాయిద్య కళాకారుడు వేలు ఆసాన్‌తో పాటు చిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు. భాగ్యరాజ్ మాట్లాడుతూ, 'చిన్న వయసులో మారియమ్మాళ్ ఆలయంలో ప్రతి రోజూ డప్పు వాయిద్యం వినేవాడిని. ఇపుడు శవయాత్రల్లో వాయిస్తున్నారు. ఇది ప్రభువు కోసం వాయించే వాయిద్యం. ఆ శబ్దం ప్రభువు చెంతకే చేరుతుంది. ఆది తమిళుడి తొలి వాయిద్యం. ఈ చిత్ర నిర్మాతలకు విదేశాలకు వెళ్ళినప్పటికీ తమిళ సంస్కృతికి చెందిన కథను ఎంచుకుని సినిమా తీసినందుకు వారికి నా ధన్యవాదాలు. ఈ సినిమా భారీ విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. అలాగే, మిగిలిన అతిథులు, చిత్ర బృందం సభ్యులు ప్రసంగించారు.

# 'జనోదయం'తోనే అరుంధతీయుల రిజర్వేషన్ కల సాకారం

● ఫాదర్ యేసు మరియాన్



పారిశుధ్య కార్మికులు, పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న ఫాదర్ యేసు మరియాన్, గొల్లపల్లి ఇశ్రాయేలు, ఫాదర్ జేవియర్ తదితరులు

ప్యారీస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అరుంధతీయుల రిజర్వేషన్ కల జనోదయం సాంఘిక విద్యాసంస్థతోనే సాధ్యమైందని ప్రముఖ న్యాయవాది, ఫాదర్ ఎల్. యేసు మరియాన్ అన్నారు. నుంగంబాక్కంలోని జనోదయం ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఉదయం చెంగై జెస్విట్ సొసైటీ-ఏఈఎల్ఐఈఎఫ్ సర్వీస్ ఆధ్వర్యంలో నగరంలోని పారిశుధ్య కార్మికులు, పేద కుటుంబాలకు చెందిన 110 మందికి సంక్షేమ సహాయాల పంపిణీ చేశారు. జనోదయం ప్రాజెక్టు డైరెక్టర్, తమిళనాడు ఆదిఆంధ్ర ఆరుంధతీయ మహాసభ (టామ్స్) వ్యవస్థాపకులు డాక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు అధ్యక్షత వహించగా, స్వర్ణ జయపాల్ స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా ఫాదర్ యేసు మరియాన్, విశిష్ట అతిథులుగా ఫాదర్ జేవియర్, ఫాదర్ వసంత్, సంఘ సేవకుడు జెరాల్డ్, టామ్స్ అధ్యక్షులు నేలటూరి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యేసు మరియాన్ మాట్లాడుతూ, నగరం, శివారు ప్రాంతాల్లో ఉన్న మురికివాడల్లో నివసిస్తున్న కుటుంబాల్లో పిల్లలకు అక్షరాలు నేర్పించాలన్న ఉద్దేశంతో 1983లో స్థాపించిన జనోదయం అంచెలంచెలుగా ఎదిగి నిస్వార్థ సేవలు అందిస్తోందన్నారు. దళిత వర్గాలకు రాష్ట్రప్రభుత్వం కల్పించిన 18 శాతం రిజర్వేషన్‌లో మూడు శాతం అరుంధతీయులకు వర్తింపజేసిన ఘనత కూడా జనోదయం-టామ్స్ సంస్థలదేనన్నారు. అనంతరం ఇశ్రాయేలు మాట్లాడుతూ, నగరంలో ఉన్న 55 గుడిసె ప్రాంతాలు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో నివసిస్తున్న అనగారిన వర్గాలకు అందిస్తున్న సేవల వల్లే జనోదయంకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. టామ్స్ కృషితో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పారిశుధ్య కార్మికుల సంక్షేమ బోర్డు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.పాల్‌కొండయ్య, రౌడా జయరాజ్, వి.దేవదానం, బీఎస్ బాలాజి, జి.రోశయ్య, సీహెచ్ తిరుమలరావు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అరుణాచలంలో విద్యుత్ ప్రభలు



విద్యుద్దీపాల వెలుగుల్లో అరుణాచలేశ్వర ఆలయం, రాజగోపురం

● ప్రకాశిస్తున్న అగ్ని క్షేత్రం

వేలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ కార్తీక దీపోత్సవాలు ఈ నెల 24వ తేది ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. వేడుకల్లో ప్రధానాంశంగా డిసెంబరు 3వ తేది ఉదయం ఆలయంలో భరణి దీపం, సాయంత్రం 6 గంటలకు ఆలయం వెనుక వైపున్న అన్నామలైయార్ కొండపై మహాదీపం వెలిగించనున్నారు. ఈ వేడుకలకు సుమారు 40 లక్షల మంది భక్తులు రానున్నట్లు జిల్లా యంత్రాంగం, ఆలయ నిర్వాహకులు భావిస్తున్నారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రత, రవాణా తదితరాలపై ఆయా శాఖల ఉన్నతాధికారులు తిరువణ్ణామలైలో మకాం వేసి పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో, వేడుకల సందర్భంగా ఆలయం రాజగోపురం, ప్రాకారాలపై విద్యుద్దీపాలు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం విద్యుత్ దీపాల వెలుగుల్లో అరుణాచలేశ్వర ఆలయం శోభిల్లుతోంది.



# రైతుల లింక్ పథకాన్ని రద్దుచేయాలి

● వ్యవసాయశాఖ అధికారుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న వ్యవసాయశాఖ అధికారులు

తిరువళ్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ అధికారికి రైతులను అనుసంధానం చేస్తూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తు తమిళనాడు ఉద్యానవన శాఖ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం మెడికల్ కళాశాల రోడ్డులో ధర్నా నిర్వహించారు. తిరువళ్లూరు వైద్య కళాశాల సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 94 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉద్యానవన పంటలను సాగు చేస్తున్నారన్నారు. ఇదిలా వుండగా ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రైతులను వ్యవసాయ అధికారికి లింక్ పథకంతో ధాన్యం, వర్షాధార పంటల కింద ఉన్న విస్తీర్ణాన్ని మాత్రమే పరిగణంలోకి తీసుకొని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. ఈ కారణంగా ఉద్యానవన పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకం అందక ఇబ్బందిగురయ్యే అవకాశం వుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం అమలు చేస్తే రైతులు ఎదుర్కొనే సమస్యలపై ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవనశాఖకు చెందిన అధికారులు, సంఘం నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఆలయ రాజగోపురం, ఆశీనభంగిమలో పెరుమాళ్

భక్తుల కష్టాలను తొలగించే

ఆలయాల నగరం కాంచీపురం సమీపంలోని తిరుప్పాడగం ప్రాంతంలో రెండు వేల ఏళ్ల నాటి ప్రాచీన పాండవదూత పెరుమాళ్ ఆలయం అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో 49వదిగా అలరారుతోంది. శ్రీకృష్ణభగవానుడు ఈ ఆలయంలో 25 అడుగుల ఎత్తులో విశ్వరూపదర్శనమిస్తుండటం విశేషం. ఈ ఆలయంలోని ఉత్సవమూర్తి అయిన పెరుమాళ్ రుక్మిణీ, సత్యభామా సమేతుడై దర్శనమిస్తారు. శిల్పకళలను పెంచిపోషించిన పల్లవరాజులు ఈ ఆలయాన్ని నిర్మించారు. విజయనగర రాజులు పలుమార్లు ఈ ఆలయానికి జీర్ణోద్ధరణ నిర్వహించినట్లు శాసనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఆలయంలో మూలవిరాట్టు 'పాండవ దూత పెరుమాళ్' తూర్పుదిశగా 'అర్ధ పద్మాసనం' వేసుకుని భక్తులను అనుగ్రహిస్తున్నారు. భూదత్తాళ్వారు, పేయాళ్వారు, తిరుమళిసై ఆళ్వారు, తిరుమంగైయాళ్వారు ఈ క్షేత్ర వైభవాన్నికీర్తిస్తూ మంగళాశాసనమొనర్చారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

# 'పాండవ దూత పెరుమాళ్'

● అర్ధపద్మాసనంలో దర్శనమిచ్చే ఆపద్బాంధవుడు





శేషవాహనంపై కనువిందు చేస్తున్న రుక్మిణీ, సత్యభామా సమేత పెరుమాళ్ - గోదాదేవి, రుక్మిణీ, సత్యభామా సమేత పెరుమాళ్

### స్థలపురాణం...

ద్వాపరయుగంలో పాండవాగ్రజుడైన ధర్మరాజు జూదంలో సకల సంపదలను, రాజ్యాన్ని కోల్పోయి 13 యేళ్ల వనవాసం, ఓ యేడాది అజ్ఞాతవాసం గడిపి తిరిగొచ్చిన తర్వాత కౌరవులతో సంధి కుదర్చమని శ్రీకృష్ణుడిని దుర్యోధనుడి దగ్గరకు రాయబారిగా పంపుతారు. శ్రీకృష్ణుడు రాయబారిగా హస్తినాపురానికి వెళతారు. ఈ విషయాన్ని ముందుగా తెలుసుకున్న దుర్యోధనుడు కృష్ణుడిని పరాభవించాలని పథకం వేసి, తన మేనమామ శకుని సలహా ప్రకారం సభలో శ్రీకృష్ణుడు కూర్చునే ఉచితాసనం దిగువ లోతైన గోయి తవ్వించి ఆయనను గోతిలో సజీవ సమాధి చేయాలని పథకం వేస్తాడు. హస్తినాపురానికి వెళ్ళిన శ్రీకృష్ణుడు తనకు కేటాయించిన ఆసనంపై కూర్చోవడంతోనే గోతిలోకి జారిపడతారు. శ్రీకృష్ణుడికి భూమిపై నూకలు చెల్లినట్లేనని దుర్యోధనుడు సహా సోదరులంతా సంతోషపడతారు. అయితే కొన్ని క్షణాల్లోనే శ్రీకృష్ణభగవానుడు విశ్వరూపం దాల్చి ఆకాశమంత ఎత్తుకు ఎదిగి కౌరవులంతా బీతిల్లేలా చేస్తారు. ఆ తర్వాత సంధి పొసగక మహాభారత సంగ్రామంలో, కౌరవులను సంహరించి పాండవులు రాజ్యాధికారం చేపట్టడం అందరికీ తెలిసిన కథే. పాండవుల కోసం రాయబారిగా వెళ్లిన శ్రీకృష్ణుడు ఈ క్షేత్రంలో 'పాండవ దూత పెరుమాళ్' కీర్తింపబడుతున్నారు. భారత సంగ్రామం ముగిసి ఎన్నో యేళ్ల గడచిన తర్వాత పరీక్షిత్తు మహారాజు తనయుడైన జనమేజయ మహారాజు వైశంపాయనుడనే మహర్షి నుంచి భారత గాథ వింటాడు. ఆ సమయంలో జనమేజయ మహారాజుకు కృష్ణ భగవానుడి విశ్వరూప దర్శనం దర్శించాలనే కోరిక పుట్టింది. తన మనసులోని కోరికను ఆ మహర్షి వద్ద తెలిపి శ్రీకృష్ణభగవానుడి విశ్వరూప దర్శనం కలిగేందుకు తరుణోపాయం తెలుపమని ప్రార్థిస్తారు. ఆ మహర్షి ఆదేశం ప్రకారం జనమేజయ మహారాజు కాంచీపురం వెళ్ళి శ్రీకృష్ణుడి అనుగ్రహం కోసం ఘోరతపమాచరించారు. ఆ తపస్సును మెచ్చి శ్రీకృష్ణ పరమాత్మ విశ్వరూపం దాల్చి ఆయన ఎదుట ప్రత్యక్షమవుతారు. ఆ కారణంగానే ఈ ఆలయంలో శ్రీకృష్ణుడు భక్తులకు విశ్వరూపదర్శనమిస్తున్నారు.

### ఆలయ వైభవం...

ఈ ఆలయం తూర్పుదిశగా నిర్మించారు.. మూడంతస్థుల రాజగోపురం దర్శనమిస్తుంది. ఈ ఆలయాన్ని పల్లవరాజులు నిర్మించారు. ఆ తర్వాత చోళులు, విజయనగర రాజులు జీర్ణోద్ధరణ చేపట్టారని, కుళోత్తుంగ చోళుడు, రాజరాజచోళుడి కాలంలో ఆలయ ప్రహరీ నిర్మించారని, రెండు తీర్థ కొలనులు కూడా తవ్వించారని శిలా శాసనాధారాలు చెబుతున్నాయి. అందులో పాండవ దూత పెరుమాళ్‌ను 'దూత్ హరి' అని పేర్కొని ఉండటం విశేషం. ఆలయ రాజగోపురం ప్రవేశ ద్వారం వద్ద అద్భుతమైన శిల్పాకృతులలున్నాయి. ప్రవేశద్వారాన్ని దాటి ఆలయం లోపలకు వెళ్తే బలిపీఠం, ధ్వజస్తంభం ఉంటాయి. కాంచీపురంలోని అత్యంత ప్రాచీన వైష్ణవాలయాల్లో ఒకటైన ఈ ఆలయంలో మూలవిరాట్టు 'పాండవ దూత పెరుమాళ్' 25 అడుగుల ఎత్తుతో తూర్పుదిశగా దరహాస వదనంతో ఆశీనులై దర్శనమిస్తున్నారు. మూలవిరాట్టు శ్రీకృష్ణుడు భద్ర విమానం దిగువన ఆశీనుడై భక్తులకు దర్శనమివ్వడం మరే వైష్ణవాలయాల్లో ఉండదని వైష్ణవ పండితులు చెబుతున్నారు.



రుక్మిణీతాయార్ సన్నిధి

ఇతర వైష్ణవాలయాల్లో ఉన్నట్లుగా స్వామివారు చతుర్భుజుడిగా కాకుండా ఓ హస్తం అభయముద్ర చూపుతూ, మరో హస్తం వరదముద్ర చూపుతూ ఉంటాయి. ఈ క్షేత్రంలోని ఉత్సవమూర్తి అయిన పెరుమాళ్ శ్రీదేవి, భూదేవితో కాకుండా రుక్మిణీ, సత్యభామా సమేతుడై పూజలందుకుంటున్నారు. ఆండాళ్ నాచ్చియార్, నర్తన పెరుమాళ్, సుదర్శనులు తదితర ఉత్సవమూర్తులు గర్భాలయంలోనే దర్శనమిస్తారు. ఈ ఆలయంలోని అర్ధ మండపంలో ఆళ్వార్లు, రామానుజులునానరు. మూలవర్లకు దక్షిణ దిశగా రుక్మిణీదేవి ప్రత్యేక సన్నిధిలో కొలువై ఉన్నారు. వెలుటి ప్రాకారంలో చక్రతాళ్వారుల వెనుకవైపు ప్రత్యేక సన్నిధిలో నరసింహస్వామి దర్శనమిస్తారు. ఆలయానికి ఈశాన్య దిశగా 'మత్స్య తీర్థం కూడా ఉంది.

ఆధ్యాత్మికం

### ఆలయ విశేషాలు...

ఈ ఆలయంలో ప్రతి యేటా దీపావళి, ముక్కోటి ఏకాదశి, పంగుణి ఉత్తిరం, కార్తీకమాసం భరణి నక్షత్ర పర్వదినాన 'సాత్రుముర్రై' ఉత్సవం తదితర వేడుకలు జరుగుతాయి. శ్రీకృష్ణుడు ఈ ఆలయంలో తన పాదాలను భూమిపై బలంగా అనించి విశ్వపాదయోగ శక్తులతో అనుగ్రహించే క్షేత్రం కావడంతో భక్తులు అంగ ప్రదక్షిణ చేస్తే సకల రోగాలు నయమవుతాయని చెబుతారు. 'పాండవ దూత పెరుమాళ్‌ను దర్శించుకుంటే వివాహ ఆటంకాలు, కార్యవిఘ్నాలు తొలగుతాయని, ప్రశాంత జీవనం ప్రాప్తిస్తుందని కూడా చెబుతారు.

### రోహిణీదేవి సందర్శించిన క్షేత్రం...

27నక్షత్రాల్లో ఒకటైన రోహిణీదేవి ఈ క్షేత్రంలోని శ్రీకృష్ణభగవానుడి ఆరాధించిన మీదటే చంద్రుడిని పతిగా పొందగలిగింది. చంద్రుడు 27 నక్షత్ర దేవతలను పరిణయమాడే పరిస్థితి వచ్చినా మొట్టమొదట జ్ఞానశక్తి కలిగి ఉన్న రోహిణీ దేవిని, ఆ తరువాత అగ్ని శక్తి కలిగి ఉన్న కార్తీక దేవిని వివాహమాడిన తర్వాతే తక్కిన నక్షత్ర దేవతలను వరుసగా పెళ్ళాడినట్లు చెబుతారు. ఇలా జ్ఞాన శక్తి కలిగిన రోహిణీ దేవి, విశ్వరూపంతో పాండవ దూత పెరుమాళ్ ఒకేచోట ఉండే దివ్యక్షేత్రంగా ఈ ఆలయానికి పేరుంద. ఇప్పటికీ రోహిణీ దేవి తిరుప్పాడగం క్షేత్రానికి సూక్ష్మరూపంలో వచ్చి పాండవ దూత పెరుమాళ్‌ను దర్శించుకుని వెళ్తున్నట్టు చెబుతారు.. కనుక రోహిణీ నక్షత్రంలో జన్మించిన వారు ప్రతి బుధ, శనివారాల్లోనూ, అష్టమి తిథి రోజున, ప్రతినెలా 8వ తారీఖున ఈ ఆలయానికి వచ్చి పాండవ దూత పెరుమాళ్‌కు అర్చనలు చేస్తే అపరిమితమైన సత్ఫలాలను పొందుతారని వైష్ణవ పండితులు చెబుతున్నారు.



ఆలయ ధ్వజస్తంభం

### ఎలా వెళ్ళాలి?...

రాజధాని నగరం చెన్నై నుంచి కాంచీపురానికి బస్సులు ప్రతి అరగంటకు ఒకటి చొప్పున ఉన్నాయి. కాంచీపురానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి వెళ్లేందుకు ఆటోలు, టౌన్ బస్సులున్నాయి. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 నుంచి రాత్రి 7.30 గంటల దాకా తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



ఆలయ అంతర ప్రాకారం



ఎంవోయూను టీటీడీ ఇంజినీరింగ్ అధికారులకు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

## 8 నుంచి అలిపిరి పాదాలమండపం పనులు

తిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అలిపిరి పాదాల మండపం పునరుద్ధరణ పనులు డిసెంబరు 8 నుంచీ మొదలు కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఎంవోయూ గురువారం టీటీడీ, లార్డ్ వేంకటేశ్వర ఛారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్టు మధ్య జరిగింది. పూణేకు చెందిన ట్రస్టు నిర్వాహకులు వెంకటేశ్వరరావు ఈపాదాల మండపాన్ని దాదాపు రూ.4 కోట్ల వ్యయంతో పునర్నిర్మాణం కోసం ముందుకు వచ్చారు. సంతకం చేసిన ఎంవోయూ పత్రాలను ట్రస్టు ప్రతినిధులు గురువారం టీటీడీ ఇంజినీరింగ్ అధికారులకు అందజేశారు.



## శ్రీవారిసేవలో మంత్రి అచ్చెన్నాయుడు

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకమండపంలో మంత్రికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అలాగే సినీ నిర్మాత దిల్ రాజు సతీమణి తేజశ్విని కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

→ అచ్చెన్నాయుడికి ప్రసాదాలు అందజేస్తున్న అదనపు ఈవో


## సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని ఒక షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.75 కోట్లు**

**బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,121**

**తలనీలాలు సమర్పించినవారు: 22,426**







తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వాహన సేవల ముందు విభిన్న సంస్కృతులు, కళాప్రదర్శనలు భక్తుల మనసును దోచాయి. రాత్రి జరిగిన హనుమంత వాహన సేవ ముందు.. ఫ్యూజన్ క్లాసికల్, కోలాటం, అన్నమాచార్య ప్రాజెక్టు అధ్వర్యంలో ఆండాల్ వైభవం, చెక్కభజన, అమరావతి డ్రమ్స్, కోలాటం, ఎస్వీ సంగీత , నృత్య కళాశాల ఆధ్వర్యంలో శ్రీరామపట్టాభిషేకం, భరత నాట్యం, నెమలినృత్యం, దాస ప్రాజెక్టు ఆధ్వర్యంలో అష్టలక్ష్మి వైభవం, తాళం డ్యాన్స్, కోలాటం ఆకట్టుకున్నాయి.
హనుమంత వాహనసేవలో మొత్తం 15 కళాబృందాలు ప్రదర్శనలు చేశాయి.

– తిరుచానూరు, ఆంధ్రజ్యోతి






## నేడు అమ్మవారికి గజవాహనసేవ



మాడవీధుల్లో తొక్కిసలాట జరగకుండా ఏర్పాటు చేసిన క్యూలైన్లు

తిరుచానూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గజవాహన సేవ జరగనుంది. తిరుమలలో శ్రీవారి గరుడసేవకున్న ప్రాముఖ్యత.. తిరుచానూరులో గజవాహనసేవకు ఉంటుంది. తిరుపతి నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గజవాహన సేవ తిలకించేందుకు పెద్దసంఖ్యలో తరలివస్తారు. దీంతో మాడవీధుల్లో ఎలాంటి తొక్కిసలాటలు, తోపులాటలు చోటుచేసుకోకుడా టీటీడీ ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసింది. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ఆలయ మాడవీధుల్లో గజవాహన సేవ ఏర్పాట్లు పరిశీలించారు. ఎక్కడా భక్తులు ఇబ్బంది పడకుండా పోలీసు, విజిలెన్సు సమన్వయంతో పనిచేయాలన్నారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, శ్రీవారి సేవకుల సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రతిరోజు వాహన సేవలు రాత్రి 9 గంటలకు ముగిస్తే, గజ, గరుడ వాహనసేవలకు మాత్రం రాత్రి 11గంటల వరకు వాహనసేవ కొనసాగే అవకాశం ఉంది.

### తిరుమల నుంచి నేడు లక్ష్మీకాసుల హారం రాక

గజవాహన సేవ నేపథ్యంలో అమ్మవారికి అలంకరించేందుకు తిరుమలలో శ్రీవారికి అలంకరించే సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని శుక్రవారం ఉదయం తీసుకురానున్నారు. ఈ హారాన్ని శోభాయాత్రగా తీసుకొచ్చి.. గజవాహన సేవలో అమ్మవారికి అలంకరిస్తారు.

## అన్యమత చిహ్నాలతో తిరుమలకు వాహనం

● అలిపిరి భద్రతా ఉద్యోగిపై చర్యలు



తిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్యమత చిహ్నాలతో ఉన్న వాహనాన్ని గుర్తించి అడ్డుకోవడంలో నిర్లక్ష్యం వహించారంటూ అలిపిరి టోల్ సిబ్బంది ఒకరిని విధుల నుంచి టీటీడీ తొలగించింది. టీఎన్ 31 ఏఈ 4073 నెంబరు గల టెంపో ట్రావెలర్ గురువారం అలిపిరి దాటి నిరాటంకంగా తిరుమలకు చేరుకుంది. ఫైర్‌స్టేషన్‌కు వెనుక పార్కింగ్‌లో ఉన్న తమిళనాడుకు చెందిన ఈ వాహనంలో అన్యమత చిహ్నం, స్టిక్కర్‌తో ఉండడాన్ని కొందరు గుర్తించి విజిలెన్స్, మీడియాకు సమాచారమిచ్చారు. విజిలెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని అన్యమత చిహ్నాలను తొలగించారు. కాగా అలిపిరి తనిఖీ కేంద్రంలోని తొమ్మిదోలైన్ నుంచి వాహనం వచ్చిందని గుర్తించి, అక్కడ విధుల్లో ఉన్న వాసు అనే భద్రతా ఉద్యోగిని తొలగించి, శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని టీటీడీ తెలిపింది. వాహన డ్రైవర్ గోబి, యజమానిపై కేసు నమోదు చేశారు.

## రాష్ట్రపతి పర్యటనకు పటిష్ఠ బందోబస్తు





పోలీసు ఆంక్షలతో నిర్మానుష్యంగా ఉన్న పద్మావతి అమ్మవారి ఆలయ పరిసర వీధులు - కలెక్టరేట్ వద్ద హైవేపై ఆగిన వాహనాలు

తిరుచానూరు/తిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా గురువారం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రేణిగుంట విమానాశ్రయం వద్ద ఉన్న టాక్సీలను ఉదయం నుంచీ పార్కింగ్‌లోకి తరలించారు. టాక్సీ బుకింగ్ కౌంటర్ల వద్ద ఎవరినీ అనుమతించలేదు. ఇక, మధ్యాహ్నం 3 గంటల తర్వాత హైవే నుంచి అమ్మవారి ఆలయం వరకున్న మార్గంలో రాకపోకలను నిషేధించారు. తిరుపతి నుంచి తిరుచానూరుకు యధావిధిగా రాకపోకలకు అనుమతించారు. ఆలయ సన్నిధి వీధిలోనూ దాదాపు రెండు గంటల పాటు ఎవరినీ రానీయలేదు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులను సాయంత్రం 4గంటల వరకు అనుమతించి.. ఆపై ఆపేశారు. రాష్ట్రపతి అమ్మవారిని దర్శించుకుని తిరుమలకు బయలుదేరాక భక్తులను యథావిధిగా అనుమతించారు. రాష్ట్రపతి రాక సందర్భంగా జాతీయ రహదారిలో కొంతసేపు ఇరువైపులా వాహన రాకపోకలను పోలీసులను నిలిపివేశారు. అక్కడక్కడ ట్రాఫిక్ జామ్ అయింది. ఇక, తిరుమలలోనూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి బస చేసే అతిథిగృహం వద్ద పటిష్ఠ భద్రతను కల్పించారు. పాసులున్న అధికారులు, సిబ్బంది మినహా మిగతా ఎవరూ ఆ ప్రాంతంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే రాష్ట్రపతి కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు. కాన్వాయ్ రావడానికి ముందే దుకాణాలు మూసివేయాలనే ఆదేశాలు జారీ చేశారు.

## సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సహకరిస్తాం

● కుప్పం నియోజకవర్గ ప్రజలు ముందుకు రావాలన్న సదరన్ డిస్కం సీఎండీ



సోలార్ విద్యుత్ ప్లాంటును పరిశీలిస్తున్న సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్

శాంతిపురం/తిరుపతి(ఆటోనగర్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రజలు ముందుకు వస్తే పూర్తి సహకారం అందిస్తామని సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ అన్నారు. శాంతిపురం మండలం అబకలదొడ్డి గ్రామంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. సూర్యఘర్ యోజనలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ పనులు, బల్ల వద్ద నిర్మాణ దశలో వున్న 33-11 కేవీ సబ్‌స్టేషన్ పనులను పరిశీలించారు. గృహాలపై జరుగుతున్న సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణపనుల తీరును చూశారు. ఈ పథకం అమలుతో కలిగే ప్రయోజనాలను తమ సిబ్బంది వివరించారా అని గృహ యజమానులను అడిగారు.సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం కుసుం పథకం కింద ఫీడర్ లెవల్ సోలరైజేషన్ పనుల్లో భాగంగా 4.9 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంట్ పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ ప్లాంట్ పూర్తి చేస్తే రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సదరన్ డిస్కం డైరెక్టర్ పి.అయూబ్‌ఖాన్, రెస్కో ఎండీ ఎస్.సోమశేఖర్, చిత్తూరు ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఛాతీ భాగంలో చొచ్చుకుపోయిన ఇనుపరాడ్డు

● శస్త్ర చికిత్సతో రాడ్డును తొలగించిన రుయాస్పత్రి వైద్యులు



పది రోజుల కిందట బాధితుడి ఛాతీభాగంలో చొచ్చుకుపోయిన ఇనుపరాడ్డు

తిరుపతి(వైద్యం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 'ఓ వ్యక్తి ఛాతీ భాగానికి రెండు వైపులా 1.5 మీటర్ల ఇనుపరాడ్డు చొచ్చుకుపోయింది. అతిక్లిష్టమైన శస్త్రచికిత్సతో ఆ రాడ్డును తొలగించి ఆ వ్యక్తి ప్రాణాలు నిలబెట్టడం గొప్ప విషయం' అని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ అన్నారు. తిరుపతిలోని రుయాస్పత్రిలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'అనంతపురానికి చెందిన షేక్ వల్లి(44) ద్విచక్ర వాహనంపై దుస్తులు అమ్ముకుంటూ శ్రీకాళహస్తిలో స్థిరపడ్డారు. పదిరోజుల కిందట దుస్తుల వ్యాపార నిమిత్తం నగరికి వెళ్లి తిరిగి పుత్తూరుకు వస్తున్నారు. ఈ క్రమంలో రహదారిపై బస్సును అధిగమించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బ్రిడ్జి పైనుంచి కింద పడ్డారు. ఆ సమయంలో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండటంతో అక్కడ ఏర్పాటు చేసివున్న 1.5 మీటర్ల ఇనుపరాడ్డు అతని ఛాతీ భాగంలో ఒక వైపు గుచ్చుకొని మరో వైపు బయటకు వచ్చింది. అదే సమయంలో అటుగా వెళ్లే కొందరు 108 అంబులెన్సుకు సమాచారం ఇవ్వడంతో వారు ఆయన్ను రుయాస్పత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో బాధితుడు స్పృహలో లేకపోవడం, అతడి వివరాలు వెల్లడించేందుకు కుటుంబ సభ్యులూ లేరు. బాధితుడి పరిస్థితి చూసి రుయాస్పత్రిలోని కార్డియోథొరాసిక్, అనస్థీషియా, సర్జరీ విభాగాల వైద్యాధికారులు హుటాహుటిన శస్త్రచికిత్సను ప్రారంభించారు. దాదాపు రెండు గంటలు శ్రమించి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను చేసి వ్యక్తి శరీరంలో ఊపిరితిత్తులకు, గుండెకు మధ్యలో చొచ్చుకుపోయిన ఇనుపరాడ్డును తొలగించి బాధితుడి ప్రాణాలు నిలబెట్టారు. శస్త్ర చికిత్స అనంతరం పది రోజులుగా షేక్ వల్లిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. పూర్తి ఆరోగ్యంగా కోలుకున్న తర్వాత గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశాం' అని ఆమె తెలిపారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల్లో అనుభవం కలిగిన వైద్యనిపుణులు కళ్యాణి రమ, గౌతమి, పద్మ, శ్రీనివాసులు, జ్ఞాపిక, రవిశంకర్ బృందం ఈ శస్త్ర చికిత్సను విజయవంతం చేసి రుయాస్పత్రి స్థాయిని మరింత పెంచారని ఆమె అభినందించారు. పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్న ఇటువంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తన ప్రాణాలు నిలబెట్టిన వైద్యులకు షేక్ వల్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శస్త్ర చికిత్స చేసిన వైద్య బృందం